


# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

SEPTEMBER - 2008

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్

## Asian Bible Lectureship at Kakinada

తేదీలు : 2008 నవంబరు 30వ తేదీ నుండి
డిశంబరు 4వ తేదీ వరకు

సమయం : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు
మధ్యాహ్నం 3:00 గంటలకు
సాయంత్రం 6:00 గంటలకు

స్థలం : సత్యవాణి - క్రీస్తుసంఘము
7-9-35 సాంబమూర్తి వీధి
కుళాయి చెరువు ఎదురుగా
కాకినాడ - 533 004.

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు, బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

Cell : 92474 56270
0884 2363722

వందనములతో
లిక్కీ గూటంగారు
జాషువా గూటంగారు

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH


P.o. Box - 80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**


***Pleading for Restoration of First Century Christianity***


సంపుటి 29 | సెప్టెంబరు 2008 | సంచిక 2


## క్రీస్తు యొక్క పునరుత్థానము

*( The Resurrection of Jesus Christ )*

యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెనను మాటను ఎవరు సందేహించరు. ప్రతిదినము ఆయన వచ్చిన సంగతిని ప్రచురము చేయుచునే యున్నది. అంతేగాక, "యేసు క్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది; యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు; దీనిని బట్టియే దేవుని ఆత్మను మీరెరుగుదురు" అని బైబిలు చెప్పుచున్నది (1 యోహాను 4:2-3).

యేసు క్రీస్తు శరీరధారియై వచ్చెను. ఆయన ఈ భూమి మీద 33 1/2 సం॥లు జీవించెను. యూదుల ద్వేషము వలన రోమా ప్రభుత్వము వారిచే సిలువ వేయబడి ఆయన చంపబడెను. అజ్ఞానము వలన, దురభిమాన ద్వేషము వలన యూదులు ఆయనను సిలువవేసి చంపించినను, దేవుని చిత్తమును జరిగించుచు యేసుప్రభువు యిష్టపూర్వకముగా తన్నుతాను సమర్పించుకొనెను. సరిగదా "మనుష్య కుమారుడు పరిచారము

చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని" తన్ను గూర్చి ఆయన చెప్పుకొనెను (మత్తయి 20:28). దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు; ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను" అని అపొ. పౌలు పరిశుద్ధాత్మ ద్వారా సాక్ష్యమిచ్చెను (1 తిమోతి 2:5-6).

## ముందుగానే తెలియజేసెను

యేసుప్రభువు సిలువపై చనిపోయి, సమాధి చేయబడి మూడవ దినమున మరణమును జయించి తిరిగిలేచెను. ఆయన చనిపోయి 3వ దినమున తిరిగి లేతునని తన శిష్యులకు ముందుగానే బోధించెను: యోనా తిమింగిలము కడుపులో మూడు రాత్రింబగళ్ళు ఏలాగుండెనో ఆలాగు మనుష్య కుమారుడు భూగర్భములో యుండును" అని ఆయన చెప్పెను (మత్త 12:40). యేసు-ఈ దేవాలయమును పడగొట్టుడి; మూడు దినములలో దానిని లేపుదునని వారితో చెప్పెను. యూదులు, ఈ దేవాలయమును నలువది యారు సంవత్సరములు కట్టిరే, నీవు మూడు దినములలో దానిని లేపుదువా? అనిరి. అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను. ఆయన మృతులలో నుండి లేచిన తరువాత ఆయన ఈమాట చెప్పెనని ఆయన శిష్యులు జ్ఞాపకము చేసికొని, లేఖనమును యేసు చెప్పిన మాటను నమ్మిరి'' (యోహాను 2:19-22).

యేసు ప్రభువు యొక్క శత్రువులు ఆయనను సిలువవేసి చంపినను,ఆయన సమాధిలో ఉంచబడినను, ఆయన తిరిగిలేతునని చెప్పిన మాటలు వారు మరచిపోలేదు. ఆయన సమాధి చేయబడిన మరునాడు, ప్రధాన యాజకులును పరిసయ్యులును రోమా గవర్నయిన పిలాతునొద్దకు వచ్చి "అయ్యా ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవదినము వరకు సమాధిని భద్రము చేయ నాజ్ఞాపించుమనిరి". "అందుకు పిలాతు - కావలి వారున్నారు గదా మీరువెళ్ళి మీ చేతనైనంతమట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో చెప్పెను. వారువెళ్ళి కావలివారిని కూడ ఉంచుకొని,

రాతికి ముద్రవేసి సమాధిని భద్రము చేసిరి" (మత్తయి 27:62-66).

## ఆయన తిరిగి లేచెను

అయితే "ఆదివారమున తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. ఇదిగో ప్రభువు దూత పరలోకము నుండి దిగివచ్చి, రాయిని పొర్లించి దాని మీద కూర్చుండెను; అప్పుడు మహా భూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె ఉండెను. అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుట వలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. దూత ఆ స్త్రీలను చూచి - మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేదు; తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు. రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి త్వరగా వెళ్లి ఆయన మృతులలో నుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి. ఇదిగో ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్ళుచున్నాడు; అక్కడ మీరు ఆయనను చూతురు; ఇదిగో మీతో చెప్పితిననెను" (మత్తయి 28:1-7).

యేసుప్రభువు సమాధినుండి పునరుత్థానుడై లేచిన తరువాత నలువది దినముల వరకు పలుమారులు తన శిష్యులకు అగపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక రుజువులను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనపరచుకొనెను (అపో.కా. 1:3). "ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను. అటుపిమ్మట ఐదువందలకు పైగా ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను ....తరువాత ఆయన యాకోబుకు, అటుతరువాత అపొస్తలులందరికిని కనబడెను. అందరికిని కడపట అకాల మందు పుట్టినట్టున్న నాకును కనబడెనని" అపో.పౌలు సాక్ష్యమిచ్చెను (1 కొరింథీ 15:4-8).

## దేవుని కుమారుడని రుజువయ్యెను

యేసుప్రభువు మృతులలో నుండి తిరిగిలేచుట వలన ఆయన దేవుని కుమారుడని మరింత బలముగా రుజువయ్యెను."యేసుక్రీస్తు శరీరమును బట్టి దావీదు సంతానముగాను, మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను" అని రోమా 1:7 చెప్పుచున్నది. మునుపెన్నడు ఎవడు

జన్మించనిరీతిగా క్రీస్తు కన్యకయైన మరియ గర్భమున బుట్టి తన జననమువలన తాను మానవుడు కాదుగాని శరీరధారియైన దేవుడని రుజువుచేసెను. మునుపెన్నడు మృతినొందినవాడు తిరిగిలేవనిరీతిగా క్రీస్తు తనకుతానే జీవము పోసుకొని మరణము జయించి తిరిగిలేచి దేవుడని రుజువు చేసెను. ఆయన ఈ లోకంలో యుండగా చనిపోయిన వారిని బ్రదికించారు, నిజమే. గాని వారు బ్రదికినను తిరిగి చనిపోయిరి. యేసుప్రభువైతే మరెన్నడు మరణించ కుండునట్లు మరణాన్ని జయించారు. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తు నందు అందరు బ్రదికింపబడుదురు" (1కొరింథీ 15:20-22).

యేసుక్రీస్తు చనిపోయి తిరిగిలేచుట వలన మరణమును జయించెను. "ఓ మరణమా నీ విజయమెక్కడ? ఓ మరణమా నీ ముల్లెక్కడ? మరణపుముల్లు పాపము. పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే.. అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగునుగాక ! "(1 కొరింథీ 15:55-57). క్రీస్తు మరణమును జయించెను గనుక, మనమును మరణమును జయించగలమనే నిర్ధారణను ఆయన మనకిచ్చెను. "యేసు - పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికి చనిపోడు" అనిచెప్పెను (యోహాను 11:25-26). దేవుడు తన అద్వితీయ కుమారుడైన క్రీస్తును మృతులలో నుండి లేపెను. ఆయన యందు విశ్వాసముంచిన వారిని కూడ ఆయన మృతులలో నుండి లేపును. "ప్రతివాడు తన తనవరుసలోనే బ్రదికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రదికింపబడుదురు" (1 కొరింథీ 15:23).

ఆయన లోకానికి వచ్చినది కూడా అందుకే. "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ

ప్రకారము మరణము యొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయము చే దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును ఆయన రక్తమాంసములలో పాలివాడాయెను" (హెబ్రీ 2:14-15). యేసుక్రీస్తు మరణాన్ని జయించారు గనుక ఆయన అనుచరులకు ఇప్పుడు మరణభయము లేదు. అందువలన, వారు "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభము" అని అపొ.పౌలు వలె చెప్పగలరు (ఫిలిప్పీ 1:21). "అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు చెరనుచెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవుల ననుగ్రహించెనని చెప్పబడియున్నది" (ఎఫెసీ 4:8).

మానవుడు చిరకాలము జీవించాలని కోరికగలవాడు. యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము ద్వారా దేవుడు ఆ కోరికను నెరవేర్చుచున్నాడు. గోత్రకర్త యగు యోబు, "మానవుడు మృతినొందిన యెడల అతడు మరల బ్రదుకునా?" అని యడిగాడు (యోబు 14:14).

మానవుని ప్రకృతి అవసరములను తీర్చుటకు దేవుడు తగిన యేర్పాట్లు చేసారు. మానవుడు ఆకలి తీర్చుకొనుటకు ఆహారమును, దప్పిక దీర్చుకొనుటకు దాహమును ఆయన అనుగ్రహించారు మరణానంతరము జీవించాలనే అతని కోరికను కూడా ఆయన తీర్చారు. యేసుక్రీస్తు యొక్క పురుత్థానమే మన పునరుత్థాన వాగ్దానము. అపొ.పౌలు యిట్లు చెప్పుచున్నాడు: "సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండ నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మా కిష్టములేదు. యేసు మృతిపొంది తిరిగిలేచెనని మనము నమ్మిన యెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. వేము ప్రభువును బట్టి మీతో చెప్పున దేమనగా, ప్రభువు రాకడ వరకు సజీవులమై యుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తు నందుండి మృతులైన వారు మొదటలేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములలో

మీద కొనిపోబడుదుము. కాగా మనము నదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకరినొకరు ఆదరించుకొనుడి" (1 థెస్స 4 :13-17).

మానవులందరు రక్షింపబడి క్రీస్తుద్వారా దేవుడిచ్చు నిత్యజీవములో ప్రవేశించాలని ఆయన కోరుచున్నాడు. మనం మరణభయము నుండి విడిపింపబడాలంటే, యేసుప్రభువు నందు విశ్వాసముంచాలి. "విశ్వసించువాడే నిత్యజీవము గలవాడు. జీవాహారము నేనే" యని ఆయన చెప్పారు (యోహాను6 :47). పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. యేసే దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అపో. కా. 2: 38). అప్పుడాయన నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చుకొనును. "మరణపర్యంతము నమ్మకముగా యుండుము, నేను నీకు జీవకిరీటమిచ్చెదనని" ఆయన చెప్పుచున్నారు (ప్రక 2:10). యేసుక్రీస్తు మరణమును జయించి తిరిగిలేచెను. మనము ఆయన యందు విశ్వాసముంచిన యెడల మరణమును జయించగలము !!

# నేటి క్రీస్తు సంఘము

*( The Church Today)*

క్రీస్తుసంఘము ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితమే స్థాపించబడెను (అపో. కా. 2). అయితే ఆనాడున్న రీతిగనే అది ఈనాడున్నది. "ఇది ఎట్లు సాధ్యమగును?" అని నీవడుగవచ్చును. క్రొత్తనిబంధనలో యున్న సంఘమాదిరి ననుసరించుట ద్వారా సాధ్యమగును.

ఈనాడున్న సంఘమే మొట్ట మొదట ఆరంభింపబడిన సంఘమని నిరూపించుటకు, దాని చరిత్రను సంవత్సరముల వారిగ పెంతెకొస్తువరకు వెనుకకు తడువవలెనని కొందరి యభిప్రాయము. అయితే అది యధార్థముకాదు. మొదటిగా ఆయన రాజ్యమెన్నటికీ నాశనము కాదనియు, అది నిత్యము నిలుచుననియు ప్రభువే మనకు వాగ్దానము చేసెను. (దానియేలు 2:44; లూకా 1:33; హెబ్రీ 12:28). దీనినిబట్టి ఆయన సంఘము ఆరంభమయిన నాటినుండినేటివరకు ప్రపంచమందు ఎక్కడో ఒకచోట

నిలవబడియే యున్నదని యర్థము. రెండవదిగా, ఆయన రాజ్యపు విత్తనమును క్రొత్తనిబంధనయందు భద్రపరుపబడి మనము కలిగియున్నాము (లూకా 8:11). అపొస్తలుల కాలములో అది క్రైస్తవులను జనింప జేసినట్లయితే నేడు కూడ అది క్రైస్తవులనే జనింపజేయును. అపొస్తలుల కాలములో సంఘము క్రైస్తవులతో సమకూర్చబడినట్లయితే నేడు కూడ అది అట్లే జరుగును. అందువలన క్రొత్తనిబంధన ఎక్కడ ఉన్నదో అక్కడ దానిని కలిగినవారు అది చెప్పురీతిగ చేసినయెడల క్రీస్తుసంఘము ఉండుట సాధ్యమే.

దేవుడు తన ప్రజలు అనుసరించుటకు ఒక మాదిరిని ఎల్లప్పుడు ఇచ్చుచునే యుండెను. ఓడను నిర్మించుట కొరకు మాదిరిని ఆయన నోవహుకు ఇచ్చెను (ఆదికాండము 6). ప్రత్యక్ష గుడారమును నిర్మించుటకొరకు మాదిరిని ఆయన మోషేకు ఇస్తూ "కొండమీద నీకు చూపబడిన మాదిరిచొప్పున సమస్తమును చేయుటకు జాగ్రత్తపడుము'' అని ఆయన హెచ్చరించెను (హెబ్రీ 8:5). అందువలన క్రొత్తనింబధన యందు ప్రభువు సంఘముయొక్క పరిపూర్ణ మాదిరి మనకు బయలు పరచబడెను. నోవహు, మోషేలకు ఈయబడిన మాదిరి ననుసరించి వారెట్లు నడచుకొనవలెనో, అట్లే సంఘపు మాదిరిని బట్టికూడ మనము నడుచుకొనవలెను. ఓడను, ప్రత్యక్ష గుడారమును నిర్మించుటలో నోవహు,మోషేలు దేవుడు ఇచ్చిన మాదిరి ననుసరించగా దేవుడెట్లు సంతోషించెనో, అట్లే మనము సంఘపు మాదిరి ననుసరించిన యపుడు దేవుడు సంతోషించును. ఏలయనగా ఏవిధమైన కలుపుట, తీసివేయుట లేకుండ ఆయన కోరురీతిగ సంఘముండును ( ప్రకటన 22:18,19).

సంఘముయొక్క రూపు రేఖలన్నియు క్రొత్తనిబంధన యందు విపులముగా వర్ణించబడినవి. సంఘమనగా ఏమిటో, దాని నెవరు స్థాపించిరో ఎక్కడ అది స్థాపించబడెనో,ఎప్పుడు స్థాపించబడెనో, అది ఏ నామము బట్టి పిలువబడవలెనో, సభ్యుల నామమేమై యుండవలెనో, దానియందు సభ్యులగుట యెట్లో, దాని కృషియేమిటో యను విషయములను గూర్చి ప్రభువే తన వాక్యమునందు వివరించెను. సంఘమనగా ఏమిటో, దాని కృషి యేమిటో తెలిసికొనుటకు అది

సందేహము లేనంత విపులముగ దాని మాదిరి అందున్నది.

గనుక బైబిలు నందున్న నిజసంఘమును తెలిసికొనుటకు మనము చేయవలసినదంతా బైబిలును చదువుటయే. దాని సత్యమును మనము గ్రహించినపుడు, దాని నవలంబించినపుడు, దాని సభ్యులమగుదుము. అట్లు క్రీస్తు ఆదిలో స్థాపించిన తన సంఘమగుదుము. ప్రతివిత్తనము దాని జాతిప్రకారము ఫలము నిచ్చును. అందువలన దేవుని వాక్యము క్రైస్తవులను, క్రీస్తు సంఘ సభ్యులను ఆనాడు ఎట్లు జనింపజేసెనో నేడును అట్లే జనింపజేయును.

ప్రపంచమందంతటా నేడు క్రీస్తు సంఘమును కనుగొనవచ్చును. అది ప్రతిచోట యున్నది. మానవులు బైబిలు చెప్పినరీతిగ చేయునపుడు ఎక్కడైనను, ఎప్పుడైనను, అది ఉండగలదు. ప్రజలు దేవుని చిత్తమును జరిగించుట ఎప్పుడు మానివేయుదురో అది అప్పుడు ఉండకుండ పోవును.

క్రీస్తు సంఘము బైబిలునే అనుసరించుటవలన బహుగా అభివృద్ధి జెందుచు వ్యాపించుచున్నది. అది విభజనను ఖండించుచున్నది. క్రీస్తును మహిమ పరచుచున్నది. బైబిలునందు నీవు కనుగొను నిజసంఘము యిదే. అది ఒక డినామినేషన్ కాదు, డినామినేషన్ల కలయిక అంతకుముందే కాదు. అది ప్రొటెస్టాంట్‌గాని, కేథలిక్కుగాని, ఒక తెగగాని కాదు. అయితే అదేమిటి? అది ప్రభువు సంఘము అంతే.

ప్రభువు సంఘమునకు భూమిపై ముఖ్య కేంద్రము(Head Quarters) గాని, అధికారిగాని లేదు. ఏ మానవుని అది ఘనపరచదు. భూసంబంధ జ్ఞానము చొప్పున అది ఆర్గనైజ్ చేయబడలేదు. ప్రతి స్థానిక సంఘము పెద్దలను, పరిచారకులను, బోధకులను, ఉపదేశకులను, సభ్యులను కలిగి స్వాతంత్ర్యము కలిగినదై యున్నది. గురువులు(Clergy),సామాన్య సభ్యులు (Laity) అను భేదములందు లేవు గనుక ఒక సభ్యుడు మరొక సభ్యునికంటె ఘనుడుగా ఎత్తబడుట అందు జరుగదు.

క్రీస్తు సంఘము ఎల్లప్పుడు శత్రువులను కలిగేయుండును గనుక నేడుకూడ దానికి శత్రువులు లేకపోలేదు. మానవ కల్పిత సంఘములు నేడు దాని నెదురించుచున్నవి. ఏలయనగా అది వారి ననుసరించుట లేదు. వాటితో క్రీస్తుసంఘము సహవాసము కలిగి

యుండుటగాని, వారికి శుభమనిగాని అది చెప్పనందున వారు దాని నెదుర్కొనుచున్నారు. వారు మానవకల్పిత బోధలను అనుసరించుచుండగా బైబిలును మాత్రమే వెంబడించువారు కొందరున్నారని ఎరిగియున్నారు. వారు మానవుల ననుసరించుచు, మానవ నామములు ధరించుకొనియుండగా మేము క్రీస్తుని వెంబడించుచు క్రీస్తు నామమునే ధరించి యున్నామని వారు జాగ్రత్తపడుచున్నారు. మాపై వారు సత్యమను ఆయుధమును గాక, ప్రజల మనస్సులలో ద్వేషమును కల్పించి, అపార్థమును జనింపజేయుచున్నారు. అయితే వారి ప్రయత్నము లన్నియును వ్యర్థమే.

యుగయుగములనుండియు క్రీస్తు సంఘము విజయమును సాధించుచున్నది. ఈ లోకమందున్న శత్రువులందరు, నరకమందున్న దయ్యములన్నియు దానిని ఆపలేవు. తనచుట్టునున్నవారికంటె అది సంఖ్యలో తక్కువగా కన్పడును; రక్షింపబడువారు నిజానికి కొందరే (మత్తయి 7:13,14). క్రీస్తుకు ఒకేఒక్క సంఘమున్నది. ఆ ఒక్క సంఘముకొరకు ఆయన రాబోవుచున్నాడు(ఎఫెసీ 5:27;యోహాను 14:1-6). ఆయన రాజ్యముపై ఆయనే రాజు. ఆ రాజ్యమును తండ్రియైన దేవునికి అప్పగించుటకు ఆయన వచ్చును (1 కొరింధీ 15:24). ఆయనకు ఒకేఒక్క పెండ్లికుమార్తె యున్నది (ప్రకటన 21:9). ఆయన నామమును ధరించియున్న ఆ ఒక్క వధువు కొరకు ఆయన ఒక దినమందు రాబోవుచున్నాడు. అయితే మిగిలిన వాటి సంగతి యేమి ? మీరెవరో నే నెరుగనని ఆయన వాటి నిగూర్చి చెప్పబోవుచున్నాడు. ఆయన వాటినన్నిటిని పెల్లగించును (మత్తయి 15:13). వాటినన్నిటిని పోగుచేయించి ఆయన అగ్నిలో వేయును.

పవిత్ర క్రొత్తనిబంధన క్రైస్తవ్యమే నేడు మా విజ్ఞాపనయై యున్నది. బైబిలునొద్దకు మరలుము. దానినే నీ మార్గదర్శిగా యుండనీయుము. బైబిలును నీ వెరిగినయెడల సత్యమును నీవెరుగుదువు. అది చెప్పురీతిగా చేసినయడల నీవు రక్షింపబడుదువు; ప్రభువు సంఘముతో చేర్చబడుదువు. దానిని గూర్చియే నీవు బైబిలునందు చదువగలవు.

నీవు క్రీస్తు సంఘసభ్యుడవు కాని యెడల త్వరలో సభ్యుడవు కావలెనని నిన్ను ప్రోత్సహించుచున్నాము. దేవుని యందు విశ్వాసముంచుము,

నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని నీవు రక్షింపబడగల్గునట్లు బాప్తిస్మము పొందుము (మార్కు16:16; రోమా 10:10; అపో.కా. 2:38). అప్పుడు ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చును. నీవొక క్రైస్తవుని వగుదువు (అపో.కా.2:47; 11:26). నీవు అట్లు చేయుదువా ? నిన్నెవరును బలవంతము చేయుట లేదు గాని నీవు నీ బైబిలును పఠించినయెడల నీవు క్రైస్తవునిగా మాత్రము ఉండగోరుదువని మా విశ్వాసము. అట్లు చేయుచు నీ జీవితమంతయు ప్రభువుకొరకు జీవించుచు ఆయన రాజ్యవ్యాప్తికొరకు నీవును కృషి చేయుదువని మా విశ్వాసము.

– జె.సి. ఛోట్

ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక – 26

# సాతాను బంధించబడుట

*(The Binding of Satan)*

**పరిచయము:**

బైబిలు అంతటిలో ప్రకటన 20వ అధ్యాయములోనే వెయ్యేండ్లపాలనను గూర్చి చెప్పబడినది. ఆ అధ్యాయములో అది 6సార్లు చెప్పబడినది. అందువలన అది అనేక అబద్ధ సిద్ధాంతములకు దారి తీసినది. ప్రకటన గ్రంథము క్రీస్తు ఈ లోకమునకు వచ్చిన నాటినుండి ఆయన మరలవచ్చువరకు జరుగు సంఘటనల కాలక్రమమును గూర్చి గాక క్రైస్తవ యుగములో సంభవించు సంఘటనలను వివిధ కోణములనుండి యోహాను చూచిన దృశ్యములను గూర్చి వ్రాయబడినది.

ప్రకటన గ్రంథము 20 వ అధ్యాయమును ఇప్పుడు చదువుము.

**అగాధము యొక్క తాళపు చెవిగల దేవదూత: (20:1)**

ఈ దూత క్రీస్తు కాదని కొందరు చెబుతారు. ఆయన ఒక దూతవలె ప్రకటన గ్రంథములో కనబడరు. ఆయన గొర్రెపిల్ల, న్యాయాధిపతి, ప్రభువు, రారాజు మొదలైన పదములతో వర్ణించ బడ్డారు.

– ఈ దూత పెద్ద సంకెళ్లను, అగాధము యొక్క తాళపు చెవిని పట్టుకొనియుండెను.

– క్రీస్తు పరలోక రాజ్యపు తాళపు చెవులను అపొస్తలులకిచ్చెను (మత్తయి 16:18-19; 18:18). ఆయన యొద్ద మరణము యొక్కయు అగాధము యొక్కయు తాళపు చెవులుండెను (ప్రకటన 1:17-18).

– అగాధము అనగా అంతులేని గొప్పలోతైన ప్రదేశము, మృతులలోకము. తాళపుచెవి అలంకారభాష, అది అధికారమునకు గురుతు. ఇహావరములయందు క్రీస్తుకు సర్వాధికారమున్నది (మత్తయి 28:18).

– ఆయన మనుష్యకుమారుడు గనుక తీర్పు తీర్చుటకు తండ్రి ఆయనకు అధికారము ననుగ్రహించెను (యోహాను 5:27).

– దయ్యములు దానిలో యుండుటకు భయపడు అగాధము పాతాళము (లూకా 8:31).దానినుండి పొగ (అబద్ధబోధలు), మిడతలు ( శ్రమ, హింస )ఉద్భవించును. యూదా: 6; 11పేతురు 2:4. పాతాళములో దురాత్మలు కనిపెట్టికొనియుండు ప్రదేశము ఈ అగాధము. వాటి నిత్య నివాసము నరకము.

– సంకెళ్లు, బంధించు శక్తికి గురుతు. దేవదూత చేతిలో యున్న సంకెళ్లు సాతానును బంధించు సువార్త శక్తి (మత్తయి 12:22-29).

**సాతానుకున్న నాలుగు పేర్లు: (20:2).**

**ఘటసర్పము:** – యెర్రని మహా ఘటసర్పము (12:13), దానికి ఏడు తలలు, పదికొమ్ములుండెను. దానితోకతో ఆకాశ నక్షత్రములలో మూడవ భాగమును ఈడ్చుకొని పోయెను (12:4). ఘటసర్పము దుష్టత్వానికి మారుపేరు.

ఐగుప్తు యొక్క ఫరోరాజులు, నెబుకద్నెజరు కూడ (యెహెజ్కేలు 29:3; యిర్మియా 51:34). పెద్దమొసలి, భుజంగము అని వారిని గూర్చి చెప్పబడినది.

**ఆది సర్పము:** – ఈ పదము మనలను ఏదేను వనమునకు నడిపించును. సాతానుడు మోసగాడు, యుక్తిపరుడు (ఆది.కా. 3:1; 2 కొరింథీ 11:14-15).

**అపవాది:**– అబద్ధాలను మోపువాడు, అక్రమముగా నేరారోపణచేయువాడు, దేవుని ప్రజలను నిందించువాడు (ప్రకటన 12:10).

**సాతాను:**– అనగా అపవాది, మన

విరోధి (1పేతురు 5:8; జెకర్యా 3:1).

**సాతాను బంధించబడుట : (20:2-3).**

- దేవునిదూత ఆ ఘటసర్పమును పట్టుకొని వెయ్యి సంవత్సరములు వానిని బంధించి అగాధములో పడవేసెను.

- సాతాను ఎప్పుడో భవిష్యత్తులో బంధింపబడునని ప్రజలు సాధారణముగా అనుకొంటారు. ఈ లోకంలోయున్న దుష్టత్వాన్ని చూస్తే సాతాను బంధింపబడి యున్నట్టు కనబడదు. గాని నిజానికి సాతాను ఇప్పటికి రెండువేల సంవత్సరములనుండి బంధింపబడియున్నాడు. క్రీస్తు సిలువపై చనిపోయి, మృత్యుంజయుడై తిరిగి లేచినప్పుడే వాడు బంధింపబడ్డాడు.

- బైబిలును బట్టి బంధింపబడుట ఏమిటో తెలిసికొందాము. మార్కు 3:27 లో యేసు ఇట్లుచెప్పారు. "ఒకడు బలవంతుడైన వానిని బంధించితేనే తప్ప, అ బలవంతుని ఇంటజొచ్చి వాని సామాగ్రి దోచుకొననేరడు, బంధించిన యెడల వానియిల్లు దోచుకొనవచ్చును".

- యేసు ప్రభువు దయ్యముల అధిపతిచేత దయ్యములను వెళ్లగొట్టు చున్నాడని ఆయన శత్రువులు నిందించగా యేసు సాతాను సాతానును ఏలాగు వెళ్లగొట్టును? సాతాను తానే విరోధముగా వేరుపడిన యెడల వాడు నిలువలేక కడతేరును అనిచెప్పి పై మాటలను పలికెను (మార్కు 3:23-26).

- ప్రభువు చెప్పిన ఆ బలవంతుడెవడు? వాడు సాతానుడే. అతని సామాగ్రి మానవునిలో యున్న దురాత్మయే. యేసు వానియింట ప్రవేశించి, వానిని బంధించారు. మానవుని విడుదలచేసారు.

- లూకా 10:17-20లో మరొక సందర్భమున్నది యేసు 70 మంది శిష్యులను రాజ్యమును గూర్చిన సువార్త ప్రకటించుటకు పంపారు. " ఆ డెబ్బదిమంది శిష్యులు సంతోషముతో తిరిగి వచ్చి ప్రభువా, దయ్యములు కూడ నీ నామము వలన మాకు లోబడుచున్నవని చెప్పగా ఆయన - సాతాను మెరుపువలె ఆకాశము నుండి పడుట చూచితిని, ఇదిగో పాములను తేళ్లను త్రొక్కుటకును, శత్రువు బలమంతటి మీదను మీకు అధికారము అనుగ్రహించియున్నాను, ఏదియు మీకెంతమాత్రము హాని చేయదు. అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడి యున్నవని సంతోషించుడని వారితో చెప్పెను"

– యేసు అపవాది యింట ప్రవేశించి, వానిని బంధింప మొదలు పెట్టారు. అప్పటికే ఆయన శిష్యులు దయ్యములను వెళ్లగొట్టుచు రాజ్యసువార్త చాటుటకుపకరించారు.

– క్రీస్తు రాజ్య సువార్త వ్యాపించే కొలదీ, సాతానుపై విజయం సాధ్యమగుచున్నది. క్రీస్తు సిలువయొద్ద అది మరింత గంభీరమైనది.

– యోహాను 12:31-33 లో యేసు "ఇప్పుడు ఈ లోకమునకు తీర్పు జరుగుచున్నది. ఇప్పుడు ఈ లోకాధికారి బయటకు త్రోసివేయబడును. నేను భూమి మీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నా యొద్దకు ఆకర్షించుకొందును" అని చెప్పెను. యేసు సిలువపై చనిపోగానే ఈ లోకాధిపతి (సాతాను) బయటకు త్రోసివేయబడ్డాడు. సాతాను యొక్క శక్తి చివరకు త్రుంచివేయబడింది.

– సిలువ యొద్ద సాతానుడు బంధింపబడుటను హెబ్రీ 2:14-15 లో మరింత విపులీకరించబడినది. " కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారై నందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవిత కాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును ఆయనకూడ రక్తమాంసములలో పాలివాడాయెను", యేసు మరణించి, సమాధిని జయించి లేవగానే సాతానుడు బంధింపబడెను." ఆయన ప్రధానులను అధికారములను నిరాయుధులనుగా చేసి సిలువ చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను" (కొలస్స 2:15).

– "చిన్న పిల్లలారా, మీరు దేవుని సంబంధులు, మీలో ఉన్నవాడు లోకములో ఉన్న వానికంటె గొప్పవాడు గనుక మీరు వానిని జయించియున్నారు" అని యోహాను వ్రాసాడు (1 యోహాను 4:4).

– సాతానును మనం జయించునట్లు సాధ్యపరచినది యేసు క్రీస్తే. సాతానుడు బంధింప బడియున్నాడు. వాని శక్తి పరిమితం చేయబడింది. వాడు చేయగలిగింది స్వల్పమే.

**బంధింపబడుట, నాశనం చేయబడుట కాదు:**

– ప్రకటన 20 చదివేసరికి ఇక్కడ అనేకులు పొరబడ్డారు. సాతానుడు

బంధించబడుట అంటే వాడు నాశనం చేయబడ్డాడని అర్ధంకాదు.

– సాతానును బంధించుట అనగా అతని శక్తిని పరిమితం చేయడమే, సాతాను శక్తిని సంపూర్ణముగా నాశనం చేయడంకాదు గాని వాడు బంధింప బడినప్పుడు వాని శక్తి పరిమితం చేయబడింది. వాడు బంధింపబడి యుండకపోతే నేడున్నలోకం ఇంకా ఘోర దుష్టత్వములో యుండును.

– క్రైస్తవులపై దాడి చేయుటలో వాడు, వాని శక్తి పరిమితి చేయబడింది. 1 కొరింధీ 10:13 ను బట్టి, నీవు దేవునితో యున్నంతవరకు సాతానుడు నిన్ను జయించలేడు, గోదుమలను జల్లించినట్టు వాడు పేతురును జల్లించాలనుకొన్నాడు, దానికొరకు దేవుని సెలవడిగాడు (లూకా 22:31). అంటే వాడొక గొలుసుతో కట్టబడి యున్నాడు. వాని శక్తి పరిమితం చేయబడింది, గొలుసుతో బంధింపబడిన కుక్కవలె వాడున్నాడు. నిజమే, వాడు గర్జించు సింహమువలె తిరుగుచున్నాడు.

– గొలుసుతో కట్టబడి యున్న పౌరుషము గల కుక్కవలె వాడున్నాడు. అట్టి కుక్క సింహము వలె అరుస్తాది. నీవు కనబడితే పళ్లుకొరుకుతాది. దొరికితే నిన్ను కాటు వేస్తాది. సాతాను కూడ అంతే. గొలుసుతో కట్టబడియున్న కుక్క దగ్గరకు నీవు వెళ్లితే అది నీకు హాని చేస్తాది; ముక్కలుగా చీల్చుతాది. బంధింపబడియున్న సాతాను పరిధిలోకి నీవు వెళ్లితే నిన్ను ముక్కలు చేసి మ్రింగుతాది.

– గాని వాని చెంతకు చేరనంతవరకు వాడు నీకు ఏ హానియు చేయకుండా దేవుడు కాపాడును.

– సాతానుడు ఇప్పుడు బంధింప బడియున్నాడు. యేసు సిలువపై చనిపోయి, మృత్యుంజయుడై లేచిన నాటినుండి వాడు బంధింపబడియే యున్నాడు.

– ఈ రోజుల్లో దయ్యములచే పీడింపబడుచున్నవారు లేరు. "మహా దినమున జరుగు తీర్పువరకు కటిక చీకటిలో నిత్య పాశములతో ఆయన బంధించి వాటిని భద్రము చేసారని" యూదా:6 లో వ్రాయబడియున్నది.

– అపవాది క్రియలను నాశనము చేయుటకు యేసు ఈ లోకమునకు వచ్చారు (1 యోహాను 3:8).

– సువార్త కవచము వలన మనం అవవాదిని ఎదిరించి జయించగలము (ఎఫెసీ 6:16 ;

యాకోబు 4:7; 1పేతురు 5:9).

**వెయ్యి సంవత్సరములు బంధింపబడుట:**

- దేవుని దూత ఆ ఘటసర్పమును పట్టుకొని వెయ్యి సంవత్సరములు బంధించి అగాధములో పడవేసెను. ఇక్కడ చెప్పబడిన వెయ్యి సంవత్సరములు అక్షరార్ధముగా తీసికొనరాదు. అట్లయితే గొలుసులు, తాళపు చెవి కూడ అక్షరార్ధముగా తీసికోవాలి.

- బైబిలులో వెయ్యి అనే సంఖ్య రూపకముగా, చిహ్నముగా చెప్పబడెను. "వేయి కొండల మీది పశువులన్నియు నావే గదా" (కీర్తన 50:10). "నీ దృష్టికి వేయి సంవత్సరములు గతించిన నిన్నటివలె నున్నవి" (కీర్తన 90:4). "ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సములు ఒక దినము వలెను ఉన్నవి" (2 పేతురు 3:8).

- సాతాను బంధింపబడియున్న ఆ వేయి సంవత్సరములు క్రైస్తవ యుగ కాలము.

**బంధింప బడుటకు కారణము:**

- " ఆ వెయ్యి సంవత్సరములు గడుచు వరకు ఇక జనములను మోసపరచ కుండునట్లు అగాధము మూసి దానికి ముద్ర వేసెను".

- జనములను మోసపరచకుండా వాడు బంధింపబడెను.

- పాత నిబంధన కాలములో ఐగుప్తు, బబులోను, అష్షూరు, పర్షియా, మాదీయ, గ్రీకు ప్రజలను అపవాది తన కంట్రోలులో ఉంచుకొనెను. క్రీస్తురాక ముందున్న లోక పరిస్థితి రోమా మొదటి అధ్యాయములో చెప్పబడినది. "సర్వలోకమును మోసపుచ్చువాడు" అపవాదియని ఇదివరకే గమనించాము (ప్రక 12:9). గాని ఇప్పుడు సువార్త యుగములో వాడు క్రీస్తు సంఘము ఎదుట నిలువ నేరడు (మత్తయి 16:18; హెబ్రీ 12:8; దానియేలు 2:44).

- దేవుని వాక్యమును నాశనం చేయలేడు (మత్తయి 24:35). ప్రపంచ సువార్త వ్యాప్తిని వాడు అపుచేయలేడు (మార్కు 16:15-16).

-" అటుపిమ్మట వాడు కొంచెము కాలము విడిచి పెట్టబడవలెను"

- అగాధ గొలుసుల నుండి సాతాను తానే విడిపించుకోలేడు, దేవుడే కొంచెము కాలము వానిని విడిచి పెట్టును.

- వాడెందుకు విడిచిపెట్టబడును? అది దేవునికి మాత్రమే తెలుసు.

- గాని బహుశ దేవుడు ప్రజలను పరీక్షించు నిమిత్తము విడిచి పెట్టబడును. యోబును పరీక్షించుటకు దేవుడు వానికి సెలవిచ్చారు.

- పొట్టునుండి గోదుమలను వేరుచేయునట్టు జల్లిచుటకు విడిచిపెట్ట బడునేమో (లూకా 22:31). ఈ పని వాడెట్లు చేయును? అబద్ధ సిద్ధాంతముల ద్వారా, లోకాశల ద్వారా, మరియు హింసల ద్వారా ఆ పనిచేయును.

**ముగింపు:**

అపవాది ఇప్పుడు బంధింప బడియున్నాడు. క్రీస్తు సువార్త వెదజల్లబడే కొలదీ, ప్రజల హృదయాలలోనుండి వాడు పారద్రోల బడుచున్నాడు. వాని నుండి ప్రజలను రక్షించే శక్తి యే సువార్త. వానిని ప్రకటించడం మనవిద్యుక్త ధర్మం.

## బైబిలు - సర్వే

# యేసు క్రీస్తు ఆయన బోధలు

యేసుక్రీస్తు ప్రపంచములో అత్యుత్తమమైన బోధకుడు. ఆయన చూపిన అద్భుతకార్యములు మహా గొప్ప కార్యములు. ఆయన చేసిన బోధలు కూడ చాల ఉత్తమమైనవి. ఈ పాఠమునందు యేసు ఏలాగు బోధించారో ఏమి బోధించారో మనము చదువుదాము.

**యేసు ఏలాగు బోధించెను:**

యేసు తన బోధలను అందరికి అర్ధమైనంత సులువుగా ఉండునట్లు బోధించెను. ప్రజలు గ్రహించునట్లు జన సామాన్యము వాడు చిన్న పదజాలమును తీసికొని అందరు ఎరిగిన ఉపమానముల ద్వారా బోధించెను. ఆయన తన సిద్ధాంతములను ఉపమానరీతిగా బోధించెను. ఉపమానము అనగా జీవిత సత్యమును చెప్పు వృత్తాంతము. కనుక ఆయన లూకా 15:11 నుండి 32 వరకు చెప్పిన తప్పిపోయిన కుమారుని గూర్చిన వృత్తాంతము కేవలము మానవులను ఆహ్లాదపరచుటకు చెప్పినది కాని అది జరిగిన సంగతియై చెప్పబడినది. ఈ ఉపమానములో యేసు చెప్పదలచినది. పరలోకమందలి దేవుడు మనలను ప్రేమించుట ద్వారా ఆయన నుండి దూరమైపోయిన మనలను తిరిగి చేర్చు కొనునని చెప్పెను.

యేసు చెప్పిన ఉపమానములు 27 నుండి 50 వరకు గలవు. వీటిలో ఎక్కువ భాగము మానవులను

ఉదాహరణగా తీసికొని చెప్పబడినవి. మిగిలినవి జంతువులు, చెట్లు ఇంకా మానవులకు బాగా పరిచయమైన వస్తురూపములపై చెప్పబడినవి.

యేసు చెప్పిన విత్తు వాని ఉపమానము చాల ప్రత్యేకమైనది. ఇందులో విత్తనములు విత్తుటకు వెళ్ళిన వాని గూర్చి ఆయన చెప్పెను. విత్తబడిన విత్తనములు కొన్ని త్రోవ ప్రక్కబడెను, కొన్ని రాతినేల మీదను, కొన్ని ముండ్ల పొదలలోను పడెను. కొన్ని మంచి నేలను పడెను. మంచినేలను పడినవే బాగుగా ఫలించెను. యేసు ఈ ఉపమానము చెప్పిన తరువాత దాని అర్ధమును శిష్యులకు ఇట్లు తెలియపర్చెను :

విత్తనము దేవుని వాక్యము ఫలించినవి, ఫలించనివి. మానవులు దేవుని వాక్యమును గ్రహించిన వారి గూర్చి, నిరాకరించిన వారి గూర్చి చెప్పబడినది.

యేసు చాల నూటియైన ప్రశ్నలను వేసెడివారు. ఒకసారి నా తల్లి ఎవరు అని ప్రశ్నించినాడు. తన సొంత ప్రశ్నకు తానే జవాబు ఈ విధముగా చెప్పి, "ఎవరైతే పరలోక మందుండు నా తండ్రి చిత్తమును నెరవేర్చుదురో వారే నా తల్లియు, నా సహోదరులు" అని చెప్పెను (మత్తయి 12:50) ఈ విధముగా ప్రజలను ఆశ్చర్యచకితులను చేసెను. ఆయన విరోధులు ఆయనను ప్రశ్నించుటద్వారా చిక్కులో పెట్టదలచి నపుడు మరలా ప్రశ్నించెడివారు, వారు ఆ ప్రశ్నకు సమాధానము చెప్పలేని సందర్భమున ఆయన కూడా సమాధానము చెప్ప నిరాకరించెడివారు. ఒక్కొక్కసారి క్రియారూపకముగా ఆయన వారికి బోధించేవారు. ఉదాహరణకు ఆయన తన శిష్యుల పాదములు కడుగుట ద్వారా వారికి బోధించెను. కేవలము శిష్యుల పాదముల మురికిని తీసివేయుటకు కడుగలేదుగాని గొప్పవాడు కాగోరువాడు మిగిలిన వారికి సేవచేయవలెనని నేర్పుటకు ఆయన అలాగు చేసెను.

## యేసు ఏమి బోధించెను :

యేసు బోధించిన విధానముకన్న బోధించిన సంగతియే ముఖ్యమైనది. మానవులకు పూర్తిగా ఒక నూతనమైన జీవిత విధానమును ఆయన నేర్పెను. దానిని బైబిలునందు బంగారు బాట యని చెప్పబడినది. "మనుష్యులు నీకు ఏమి చేయవలెనని నీవు కోరుచున్నావో వారికిని నీవు ఆలాగుననే చేయుము" (మత్తయి 7:12). ఈ సిద్ధాంతము మోషే

ధర్మశాస్త్రమునకన్న అధికమైనది. ఇదియుగాక మరి ఏ యితర మత సిద్ధాంతములందు ఇది కానరాదు.

యేసు చెప్పిన సిద్ధాంతముల యొక్క సారాంశమును మత్తయి 5,6,7 అధ్యాయములయందు మనము చూడగలము. దీనినే కొండ మీది ప్రసంగమని కూడా పిలిచెదరు. పాఠకులు ఈ 3 అధ్యాయములను తప్పక చదువవలెను. ఈ భాగమునందు వివిధములైన అంశముల మీద బోధించబడెను. ధన్యత వచనములతో ఈ ప్రసంగము మొదలు పెట్టబడినది. ఎవరైతే దేవునికి ఇష్టులై యుందురో వారు ఆశీర్వదించబడుదురని వ్రాయబడినది. ఉదాహరణకు కనికరము గలవారు ధన్యులు. వారు కనికరము పొందుదురు. హృదయ శుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు (మత్తయి 5:7,8).

ఇక్కడ యేసు ధనికులను, ప్రఖ్యాతి గాంచినవారిని ఆశీర్వదింతునని చెప్పుటలేదు. గాని ఎవరైతే దేవుని యెడల యదార్ధహృదయముతో ఉండి దేవుని సేవించి తోటి మానవులను కూడా సేవించిన యెడల ఆశీర్వదింతునని చెప్పెను. "ఇహలోకమందు మీరు ధనమును సమకూర్చుకొనకుడి ... ... కాని పరలోకమందు ధనమును సమకూర్చుకొనుడి" (మత్తయి 6:19,20). ఇచ్చట ప్రభువు నిజమైన ధనము ఆత్మీయమైన వాటియందే గలదుగాని భౌతికమైన వాటియందు లేదని చెప్పుచున్నారు.

ఈ ప్రసంగము నందు యేసు ఇంకనూ ఈ విధముగా చెప్పుచున్నారు: మానవులు ఆలోచన ద్వారా క్రియ ద్వారా పాపము చేయుదురు.

"నరహత్య చేయవద్దు నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును" (మత్తయి 5:21,22). మరలా ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును (మత్తయి 5:28).

విడాకులను గురించి చాల స్పష్టముగా యేసు బోధించెను. "నేను మీతో చెప్పునదేమనగా వ్యభిచారకారణమును బట్టి కాక తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను

వ్యభిచారిణిగా చేయుచున్నాడు. విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు (మత్తయి 5:32). ఆలాగే ఒట్టుపెట్టుట గురించి ఆయన చాలా స్పష్టంగా వివరించారు : "నేను మీతో చెప్పునదేమనగా ఎంతమాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు, ఆకాశము తోడనవద్దు అది దేవుని సింహాసనము. భూమి తోడనవద్దు అది ఆయన పాదపీఠము (మత్తయి 5:34-35).

కొండమీద ప్రసంగములో శాంతిమార్గాన్ని ఆయన తెలియపరిచారు. బహుశ ఏ సిద్ధాంతములోనూ మతములోనూ మానవ ఆలోచనకు విరుద్ధమైన ఈ ఆలోచన వుండదు. ఒకవేళ మానవులు అందరూ దీనిని అనుసరించినయెడల రాబోవు కాలములో యుద్ధములు జరుగవు. కంటికి కన్ను పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారు కదా నేను మీతో చెప్పునన దేమనగా దుష్టుని ఎదిరింపక నిన్ను కుడిచెంప మీద కొట్టువాని వైపునకు ఎడమచెంపకూడా త్రిప్పుము (మత్తయి 5:38,39). దీనిని అనుసరించటం చాలా కష్టం కానీ క్రీస్తు యొక్క బోధ అంతయూ దీని పైననే ఆధారపడి యున్నది.

## దేవుని రాజ్యము

ఆయన వ్యక్తిగత సేవ చేయునప్పుడు యేసు దేవుని రాజ్యమును గూర్చి చాలా బోధించెను. ఆయన బోధించిన చాల ఉపమానములు దేవుని రాజ్యమును గూర్చి పోల్చబడినవి. వీటిలో పులి పిండిని గూర్చిన ఉపమానము, ఆవగింజ ఉపమానము బాగా తెలిసినవే. దేవుడు అంతము లేని శాశ్వత రాజ్యాన్ని స్థాపిస్తాడని దానియేలు ప్రవచించాడు (దాని. 2:44). యూదులు భౌతిక సామ్రాజ్యం గురించి ఎదురు చూస్తున్నారు. కానీ యేసు స్థాపించనున్నది ఆత్మీయమైన రాజ్యము. ఆయన యెరూషలేమునందున్న దావీదు సింహాసనం మీద కూర్చుని రాజ్యపాలన చేయరు కానీ మనుష్యుల హృదయాలను పరిపాలిస్తారు. యేసు తాను భౌతికరాజ్యాన్ని స్థాపిస్తానని ఎన్నడూ బోధించలేదు. తన రాజ్యమే సంఘమని క్రీస్తు బోధించారు (మత్తయి 16:18,19). అది త్వరలో స్థాపించబడునని ఆయన చెప్పారు. రాబోవు పాఠాలలో దేవుని రాజ్యము ఎప్పుడు, ఎలా స్థాపించబడునో మనం నేర్చుకొందాం.

యేసు పరలోకమును గూర్చి నరకాన్ని గూర్చి చాలా చెప్పాలనుకున్నారు. ప్రభువుకు విధేయులైనవారు ఉండే స్థలం పరలోకమని దేవుని చేత

నిరాకరించబడువారు ఉండే స్థలం నరకం అని వివరించారు. సిద్ధపడని వారిని "సమకూర్చి అగ్నిగుండములో పడవేతురు అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయు యుండును" (మత్తయి 13:41,42). అయినా దేవుడు మానవులను ఎంతో ప్రేమించి ఆ భయంకర పరిస్థితి నుండి తప్పించుటకు తన కుమారుని పంపించారు.

యేసు తానే దేవుని కుమారుడనని చెప్పుకున్నారు. మానవులను మంచి మార్గమున నడుపు మంచి మానవుడే కాక అంతకన్న గొప్పకాడు. లోక పాపమునుండి రక్షించుటకు వచ్చారు. ఒక వేళ యేసు దేవుని కుమారుడు కాని పక్షమున అతనికన్న మోసగాడు చరిత్రలో యికవుండడు. అతని బోధలు నమ్మ దగినవి కాకపోవును. కానీ ఆయన చేసిన బోధలనుబట్టి ఆయన దేవుని కుమారుడుగా ఋజువు చేయచున్నవి మరియూ ఆయన దైవత్వము యదార్ధము.

## యేసు యొక్క ఆహ్వానము

మానవులందరు తనయొద్దకు రావలయునని రక్షకుడు కోరుచున్నాడు. కానీ ఆయన ఎవరినీ తన్ను అంగీకరించవలసినదిగా బలవంత పరచుట లేదు. అందరినీ ఆహ్వానించుచున్నారు. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి. నేను మీకు విశ్రాంతిని కలుగజేతును. నేను సాత్వీకుడను, దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏల యనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి" (మత్తయి 11:28-30).

**గమనిక:** గత 24 సంచికలలోను సంఘమును గూర్చిన వివిధ అంశములను సత్యవాక్కులో ప్రచురించాము. అవన్నీ ఒక పుస్తకము రూపమున ఇప్పుడు ముద్రించబడి లభించుచున్నవి. బైబిలు సంఘము అను పుస్తకము కొరకు సత్యవాణి ఆఫీసుకు 25/- రూ॥లు M.O ద్వారా పంపండి:

**SATYAVANI,7-9-35 Ramaraopet, Kakinada - 533 004**

# సంక్షిప్త వార్తలు

2008 ఆగస్టు మొదటి తేదీ శుక్రవారం కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణలో జరిగిన సువార్తికుల సదస్సునకు అనేకమంది సోదర సోదరీలు హాజరైరి. సోదరులు యన్.ఏలియా గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభ మాయెను.గొల్లపాలెంలో పలు సంవత్సరాలుగా సేవచేయుచున్న సోదరులు జాన్ మోజెస్ గారు స్థానిక సంఘమును అభివృద్ధి చేయుట ఎట్లు అను అంశముపై చక్కటి వాక్యానుసారమైన హెచ్చరికలిచ్చిరి. తదుపరి అమెరికా నుండి వచ్చిన జోర్డన్ పావెల్ గారు, సీజర్ గార్లు ప్రసంగించగా సోదరులు రాజా విజయకుమార్ గారు, ప్రసాద్ గారు అనువదించుటలో సహకరించిరి. అమెరికానుండి వచ్చిన సోదర సోదరీలు మొత్తము 15 మంది కొన్ని ఆంగ్ల స్తుతిగీతములను విన్పించి అందరికీ ఆత్మీయానుభూతిని పంచిరి. మధ్యాహ్న కాలమందు జరిగిన ప్రత్యేక స్త్రీలకూటములో రేచెల్ పావల్ గారు, సోదరి బెవర్లీ గారు వాక్యమునందించిరి.

2008 ఆగస్టు 2వ తేదీనాడు పశ్చిమగోదావారి జిల్లా పెదగరువులో జరిగిన కూటములో రిక్కీగూటం గారు, అమెరికా సువార్త బృందము పాల్గొనిరి. అక్కడ చిరకాలముగా గోసాల సూర్య ప్రకాశరావ్ గారు పనిచేయుచున్నారు. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఆగస్టు 8వ తేదీన పిఠాపురం జగయ్యచెరువులో కూటము జరిగెను. అక్కడ రెండువందలకు పైగా చిన్న పిల్లలు, విద్యార్థులు హాజరైరి.వచ్చిన వారందరికీ క్రొత్తనిబంధన గ్రంధము ఉచితముగా అనుగ్రహించబడెను.అక్కడ పెబ్బిలి సత్యానందం గారు పనిచేయుచున్నారు.

ఆగస్టు 9వ తేదీనాడు పశ్చిమ గోదావరిజిల్లా తామరాడలో జరిగిన కూటములో అమెరికానుండి వచ్చిన యువక బృందము ఆసక్తితో పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. అక్కడ సోదరులు చిట్టిబాబుగారు సువార్త చాటుచున్నారు.

ఆగస్టు 10నుండి 16 వరకు కాకినాడ సత్యవాణి చిల్డ్రన్ హోమ్‌లో యున్న బాలబాలికలకు అమెరికా యువక బృందము దేవుని వాక్యమును బోధించుటలోను,వివిధ వృత్తులను నేర్పించుటలోను సమయాన్ని గడిపిరి.

ఆగస్టు 18వ తేదీనాడు పశ్చిమ గోదావరి కరుగోరుమిల్లిలో జరిగిన కూటములో రిక్కీగారు,ఏరన్‌గారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు యన్.మోజెస్‌గారు,ఆయన కుమారులు సువార్త చాటుచున్నారు.

అగస్టు 19వ తేదీనాడు కొవ్వూరు ఆర్.టి.సి.కోలనీలో గల క్రీస్తు సంఘము నిర్వహించిన కూటములో రిక్కీగారు,ఏరన్ మరియు క్రిస్టల్ ఫక్స్ దంపతులు పాల్గొనిరి. వాక్య పరిచర్య చేసిరి. కొవ్వూరులో సోదరులు బట్టు చంటి(బాబురావు)గారు, వారి కుమారుడు రత్నరాజు గార్లు సువార్త చాటుచున్నారు.

అగస్టు 22వ తేదీ శుక్రవారం తుని మండలం డి.పోలవరం గ్రామములో జరిగిన సువార్త కూటములో ఏరన్ దంపతులు, రిక్కీగూటం గారు పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ సి. హెచ్.పీటర్‌గారు వాక్య పరిచర్య చేయుచున్నారు.

అగస్టు 23వ తేదీ శనివారం నర్సీపట్నం మండలం బకలూరులోను,కొడవడిపూడిలోను జరిగిన కూటములలో రిక్కీగారు,ఏరన్‌గారు వాక్యపరిచర్య చేసిరి. ఆ ఏజెన్సీ ఏరియాలో సోదరులు సి. హెచ్. జోసఫ్‌గారు తదితరులు వాక్య పరిచర్య చేయుచున్నారు.

అగస్టు 27వ తేదీ బుధవారం సామ్యూల్ రోనీ గూటంగారు అమెరికాకు తిరిగి ప్రయాణమై క్షేమముగా చేరుకొనిరి.

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2006-2008**

**To**

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 001